జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
మంగళవారం 12-05-2026
జిల్లా వార్తలు
WWW.DASHANEWS.COM

# లక్ష్మీపురం లారీ యార్డులో దారుణం

❖ మద్య మత్తులో బండరాయితో దాడి
❖ బీహార్ యువకుడు మృతి!



**దశ, బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం లారీ యార్డు వద్ద దారుణమైన హత్యాఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగిన తీవ్రమైన ఘర్షణ ఘాతక సంఘటనగా మారింది. ఈ ఘటనలో ఒక వ్యక్తిని బండరాయితో తలపై బలంగా కొట్టి చంపారు. బాధితుడు సంఘటనా స్థలం వద్దనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్ సింగ్(45) గా గుర్తించారు. స్థానికంగా ఈ ప్రాంతంలో లారీ యార్డు ప్రదేశం పనివారు, కార్మికులకు కేంద్రంగా ఉంటుంది. ఇక్కడే మద్యం సేవించిన ముగ్గురు వ్యక్తుల మధ్య చిన్న అంశం మీద గొడవ మొదలైంది. మద్యం ప్రభావంతో కోపం తీవ్రమై, ఘర్షణ దారుణ దాడిగా మారింది. ఒకరు బండరాయిని తీసుకుని కుందన్ సింగ్ తలపై కొట్టారు. రక్తం కక్కుతూ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన సమాచారం పొందిన బూర్గంపాడు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకునీ పరిస్థితులు పరిశీలించారు. మృతదేహం చుట్టూ రక్తపు మడుగులు, బండరాయి స్థానికుల సాక్ష్యాలు సేకరించారు. హత్యకు సంబంధించిన పూర్తి కారణాలు ఇంకా తెలియవు. మద్యం మత్తులో జరిగిన ఘర్షణే కారణమని అనుమానిస్తున్నారు. దాడి చేసిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. లారీ యార్డుల్లో కార్మికుల మధ్య ఇలాంటి గొడవలు తగ్గాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆరోపణల ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు.

# పట్టణాల నుండి పల్లెల్లోకి పాకిన గంజాయి



**దశ, వీపనగండ్ల:** మండల పరిధిలోని వల్లభాపూర్ క్రాస్ రోడ్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆటోలో గంజాయి తరలిస్తున్న యువకుడిని పట్టుకుని జైలుకు తరలించారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై నరేష్ కథన ప్రకారం మండల పరిధిలోని కొర్లకుంట గ్రామానికి చెందిన కేతావత్ రమేష్ అనే యువకుడు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్, ఆటో సీటు కింద గంజాయిని దాచుకుని తీసుకెళ్తున్నాడని పోలీసులకు సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో స్థానిక పోలీసులు మరియు క్లూస్ టీమ్ సహాయంతో వల్లభాపూర్ ఎక్స్ రోడ్ వద్ద తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు .ఈ సందర్భంగా రమేష్‌ను అదుపులోకి తీసుకుని ఆటోను పరిశీలించగా 15 గ్రాముల గంజాయి లభ్యమైంది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని రమేష్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపించినట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా తెల్లరాళ్ల పెల్లి తాండాకు చెందిన సంతోష్, నిఖిల్, సాయి లతో కలిసి గంజాయి సేవిస్తున్నట్లు తెలిపాడు. అనంతరం గంజాయి అమ్మకాల ద్వారా సులభంగా డబ్బులు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో వీరంతా కలిసి ఇతర ప్రాంతాల నుండి గంజాయి తెప్పించి స్థానికంగా విక్రయిస్తున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

# అకాల వర్షాలకు కరెంటు స్తంభాలు నేలమట్టం

❖ 18 గంటలుటు శ్రమించి పునరుద్ధరించిన అధికారులు



**దశ, బూర్గంపాడు:** అకాల వర్షాలు, ఈదురుగాలులు, దుమ్ము తుఫానులతో పినపాక పట్టినగర్ గ్రామం తీవ్రంగా దెబ్బతింది. భారీ గాలులకు దాదాపు 30 విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోవడంతో హైటెన్షన్, లోటెన్షన్ తీగలు తెగి గ్రామమంతా చీకట్లో మునిగిపోయింది. పలు పెద్ద చెట్లు ఇళ్లపై, రోడ్లపై, విద్యుత్ లైన్లపై కూలిపడగా, కొన్ని ఇళ్ల రూఫులు, గోడలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ భూములు నీట మునిగి పంటలకు కూడా నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితిని గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12.30 గంటల వరకు దాదాపు 18 గంటలు నిరంతరంగా శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్త పోస్టులు ఏర్పాటు చేసి, తెగిన తీగలను మరమ్మతు చేసి గ్రామానికి మళ్లీ వెలుగు నింపారు. ఈ పునరుద్ధరణ పనుల్లో గ్రామ సర్పంచ్ బానోత్ పద్మ కీలకంగా వ్యవహరించారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ, గ్రామంలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టించారు. ప్రజలకు ధైర్యం చెబుతూ సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఎంపీడీవో జమాలా రెడ్డి నేతృత్వంలో పంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి ఇళ్లపై పడిన చెట్లను తొలగించి, ప్రమాదకర లైన్లను డిస్కనెక్ట్ చేసి గ్రామాన్ని సాధారణ పరిస్థితికి తీసుకొచ్చారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. విపత్కర సమయంలో అహర్నిశలు శ్రమించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# డంపింగ్ యార్డులో మంటలు రాకుండా చర్యలు



❖ మంత్రి కొమటిరెడ్డి ఆదేశాలతో కమిషనర్ పరిశీలన

**దశ, నల్గొండ :** తెలంగాణ ప్రభుత్వ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర సోమవారం నగరంలోని రిసోర్స్ పార్క్ (డంపింగ్ యార్డు)ను పరిశీలించారు. వేసవి తీవ్రత కారణంగా డంపింగ్ యార్డులో మంటలు, పొగలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

డంపింగ్ యార్డులో కొనసాగుతున్న బయోమైనింగ్ పనులు, అగ్ని ప్రమాద నివారణ చర్యలను కమిషనర్ పరిశీలించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నిరంతరం నీటిని చల్లి మంటలు అదుపులో ఉంచాలని సూచించారు. ఇటీవల త్రవ్వించిన బోర్‌వెల్‌కు వెంటనే మోటార్ ఏర్పాటు చేసి నీటిని వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రస్తుతం రిసోర్స్ పార్క్‌లో సుమారు 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉండగా, అందులో 14 వేల మెట్రిక్ టన్నుల బయోమైనింగ్ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని బయోమైనింగ్ ఏజెన్సీ ప్రతినిధులకు కమిషనర్ సూచించారు.డంపింగ్ యార్డు పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ అసీమ్ బాబా, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రదీప్ రెడ్డి, డంపింగ్ యార్డు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శశిధర్, బయోమైనింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, మున్సిపల్ ఇంజనీరింగ్ , శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# న్యాయస్థాన సమస్యలను పరిష్కరిస్తా

❖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**దశ, హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ న్యాయస్థానాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి న్యాయవాదులకు హామీ ఇచ్చారు. హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా ఆ సంస్థ అధ్యక్షుడు నారపరాజు శ్రీనివాసరావు తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సాముల రామిరెడ్డి సీనియర్ న్యాయవాది కుక్కడపు బాలకృష్ణ లతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అధునాతన సౌకర్యాలతో న్యాయస్థాన భవన సముదాయము, న్యాయమూర్తుల గృహ సముదాయాల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.న్యాయస్థానాల్లో ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధ్యక్షులు నారపురాజు శ్రీనివాసరావు ను మంత్రి కోరారు. తమ సమస్యలపై స్పందించిన మంత్రికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బార్ కౌన్సిల్ సభ్యులు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు.



నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన నిత్యానంద్ ను సోమవారం తెలంగాణ ఎల్ టీ పి ఎస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అంబం లింగయ్య మర్యాదపూర్వక గా కలిసి శాలువా తో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.
-(పెద్ద అంబర్పేట్ )

# ఆదివాసీ రైతు పామాయిల్ తోట దహనం

❖ నిందితులను కఠినంగా శిక్షించాలి!
❖ రైతు నరసింహారావుకు రూ. 4 లక్షల నష్టం
❖ ప్రభుత్వమే ఆదుకోవాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్



**దశ, అశ్వాపురం:** అభివృద్ధి చెందుతున్న తోటి రైతును చూసి ఓర్వలేక పామాయిల్ తోటను తగలబెట్టడం అత్యంత హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మండిపడ్డారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు, గిరిజన సంఘం నాయకుడు పాయం నరసింహారావుకు చెందిన 4.5 ఎకరాల పామాయిల్ తోటను దుండగులు నిప్పుపెట్టి కాల్చివేసిన ఘటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి కాలిపోయిన తోటను సందర్శించి, బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పక్క పొలం రైతు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి తోటను తగలబెట్టడం వల్ల సుమారు 250 మొక్కలు కాలిపోయాయని తెలిపారు. దీనివల్ల రైతుకు రూ. 4 లక్షల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని, రెండేళ్ల కష్టం వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన మరియు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో స్పందించి, జరిగిన నష్టంపై సమగ్ర అంచనా వేయాలని సీపీఎం కోరింది. బాధితుడికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, తిరిగి సాగు చేసుకునేందుకు వీలుగా మొక్కలు, డ్రిప్ పైపులను 100 శాతం సబ్సిడీపై అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, గద్దల శ్రీనివాసరావు, పాయం విజయ, జానకమ్మ, శంబిరెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

❖ గృహప్రవేశానికి ఆహ్వానం అందజేసిన మోటూరి మోహన్
❖ పార్టీ బలోపేతంపై నాయకులకు కేటీఆర్ దిశానిర్దేశం



**దశ, అశ్వారావుపేట:** అశ్వారావుపేట మండల బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకులు బొమ్మ రామమూర్తి, మోటూరి మోహన్, కాసాని చంద్రమోహన్, డాక్టర్ బి. ప్రసాద్ రావు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి జుజ్జురపు శ్రీరామమూర్తి, నవీన్ తదితరులు సోమవారం హైదరాబాద్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోటూరి మోహన్ తాను నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను వారికి అందజేశారు. ఈ గృహప్రవేశ కార్యక్రమం 14వ తేదీ బుధవారం జరగనున్నట్లు తెలిపారు.


సీనియర్ నాయకులు బొమ్మ రామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో అశ్వారావుపేట రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చ జరిగింది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన కాసాని పద్మ చంద్రమోహన్ కృషిని కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను మరింత ఏకం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాడాలని, అశ్వారావుపేటలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులను కేటీఆర్ సమక్షంలో సన్మానించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ కౌన్సిలర్ భూక్యా ఉదయజ్యోతి భర్త డాక్టర్ బుక్యా ప్రసాద్‌ను ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే పార్టీ కష్టకాలంలోనూ నిరంతరం సేవలందిస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న సీనియర్ నాయకుడు జుజ్జురపు శ్రీరామమూర్తిని కూడా ఘనంగా సన్మానించారు. అగ్ర నాయకత్వం నుంచి వచ్చిన గుర్తింపుతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాలేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
మంగళవారం
12-05-2026
WWW.DASHANEWS.COM



# మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

❖ *MLC తాతా మధుసూదన్*



**దశ, ఖమ్మం:** రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ మైనర్ బాలికపై చేసిన అమానుష అఘాయిత్యాన్ని కప్పిపుచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు అటవీక సమాజాన్ని తలపిస్తున్నదని వెంటనే కేంద్రమంత్రి కొడుకును పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని MLC, BRS పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ రావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక అమాయకపు చిన్నారిపై జరిగిన ఈ దారుణమైన ఘటనలో బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, నిందితులను రక్షించడానికి అధికార యంత్రాంగం మరియు పోలీసులు బరితెగించడం దారుణమన్నారు. ఈ కేసులో అత్యంత కఠినంగా ఉండాల్సిన పోక్సో (POCSO) చట్టం కింద నమోదు చేయాల్సిన సెక్షన్లను, కావాలనే బలహీన పరిచి, నిందితుడిని బయటపడేసేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తంచేస్తుందన్నారు. కేంద్ర హోమ్ మంత్రి గా పదవి వెలగబెడుతూ చట్టాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్న బండి సంజయ్ దుశ్చర్యలను చూస్తుంటే ప్రజాస్వామ్యం ఎటువైపు వెళ్తుందో అన్న ఆందోళన కలుగుతోందన్నారు. మైనర్ బాలిక కుటుంబ సభ్యులపై బండి సంజయ్ కుటుంబ సభ్యులు సాగిస్తున్న ఈ దుర్మార్గమైన దాష్టీకాన్ని, పోలీసుల వైఫల్యాన్ని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. మైనర్ బాలిక అని తెలిసినా బండి సంజయ్ కుమారుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. పోక్సో కేసు నమోదు అయిన వెంటనే నిందితుడిని అరెస్ట్ చేయాలి మరి బండి సంజయ్ కుమారుడు ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? నిందితుడిని అరెస్టు చేయకపోగా తిరిగి బాధితులపైనే కేసు పెట్టడం ఆశ్చర్యకరం. భారతీయ విలువలను వల్లవేసే భారతీయ జనతా పార్టీ తక్షణమే బండి సంజయ్ ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి లేదా బండి సంజయ్ స్వయంగా తన పదవికి రాజీనామా చేయాలి. పోక్సో కేసులో నిందితుడైన బండి సంజయ్ కుమారుడు భగీరత్ ను వెంటనే అరెస్ట్ చెసి మైనర్ బాలికకు న్యాయం చేయాలని BRS పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.



## PV కాలనీ మంచినీటి సరఫరాకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి

❖ *AITUC బ్రాంచి సెక్రటరీ రాంగోపాల్*

**దశ, మణుగూరు:** మణుగూరు మండలం గత రెండు రోజులుగా PV కాలనీలో నీటి సరఫరా నిలిచి పోవడంతో కాలనిలో నీళ్ళు లేక కార్మిక కుటంబాలు ఇళ్లలో తీవ్రనీటి ఏద్దటి తో ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటి ఇబ్బందిని సత్వారమే తీర్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని AITUC బ్రాంచి సెక్రటరీ రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఎండా కాలం కావడంతో పెద్దలు, పిల్లలు, నీళ్లులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటర్ ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా చేసి మంచి నీటిని కొరత తాత్కాలికంగా తీర్చ డానికి చర్యలు తీసుకోగలరు. సంబంధిత, పరిసర గ్రామ పంచాయతీ సర్పంచ్లు అధికారులు స్పందించి నీటి ఏద్దది తీర్చడానికి వాటర్ ట్యాంకర్ల తో PV కాలనీకి నీటి సరఫరా చేసి మంచినీళ్ళని అందించ గలరని AITUC మణుగూరు బ్రాంచ్ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

## దగ్ధమైన పామాయిల్ తోటను పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



**దశ, అశ్వాపురం:** అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో సుమరు 5 ఎకరాల పామాయిల్ తోటలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 300మొక్కలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. సోమవారం పామాయిల్ మొక్కలు దగ్ధమైన సంఘటన స్థలాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత రైతుక ధైర్యం చెప్పారు. రైతుకు అండగా ప్రభుత్వం నుండి నష్టపరిహారం వచ్చేవిధంగా పోరాటం చేస్తామని, రైతుకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా నాయకులు కే.బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, భద్రయ్య, గద్దల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు ఎఫ్డిఓ గా అదనపు బాధ్యతలు తీసుకున్న పాల్వంచ వైల్డ్ లైఫ్ ఎఫ్డిఓ బాబు



**దశ, మణుగూరు:** మణుగూరు ఎఫ్డిఓ సయ్యద్ మక్సుద్ మోహిద్దీన్ బదిలీ అయ్యారు. సుమారు 4 సంవత్సరాల కాలం మణుగూరు ఎఫ్డిఓగా పనిచేసి ఈ ప్రాంత ప్రజలల్లో మంచిపేరు సంపాదించారు. ఆయనకు బదిలీ అయిన క్రమంలో అదే స్థానంలో మణుగూరు ఎఫ్డిఓగా సోమవారం పాల్వంచ వైల్డ్ లైఫ్ ఎఫ్డిఓ బాబు అదనపు భాధ్యతలు చేపట్టారు. నూతనంగా పదవీ భాధ్యతలు చేపట్టిన ఎఫ్డీఓకు మణుగూరు డివిజన్ పరిధిలో గల అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.



## మే 11 నుంచి ఇంటింటికీ జనాభా లెక్కల సేకరణ

**దశ, పినపాక:** పినపాక మండల వ్యాప్తంగా మే 11, 2026 నుంచి జూన్ 9, 2026 వరకు ఇంటింటికీ వెళ్లి జనాభా లెక్కల సేకరణ చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ప్రత్యేక బృందాలు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలను సేకరిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ వివరాలను సరైన విధంగా అందించి అధికారులకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని అధికారులు వెల్లడించారు. అధికారుల వివరాలను ధృవీకరించిన తరువాతే సమాచారం ఇవ్వాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆదివాసీ సమన్వయ సదస్సు జయప్రదం చేయండి



**దశ, పినపాక :** ఈ నెల 13న హైదరాబాద్‌లోని సుందరయ్య భవనంలో జరిగే జాతీయ ఆదివాసి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ మరియు సంస్కృతి సాంప్రదాయ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం మండల అధ్యక్షులు కొమరం శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం పినపాక మండలం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్ లో సదస్సు కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ రక్షణ PESA చట్టంలోని కొన్ని మార్పులతో స్వయం పాలన కల్పించాలన్నారు. ఆదివాసి సాంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షణ కోసం జన గణన 2027 లో జరిగే సెన్సెస్ లో ఆదివాసీలకు ప్రత్యేక రిలీజియన్ (మతం) కోడ్ కాలం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం బహులార్ధక ప్రాజెక్టు వలన నాలుగు రాష్ట్రాలలో ముంపు గురవుతున్న మూడు లక్షల ఆదివాసులను (R&R) ప్యాకేజీ కింద పునరావాసం, మెరుగైన నష్టపరిహారం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ROFR) 2006 పెండింగ్లో ఉన్న ఎనిమిది లక్షలు ఎకరాల భూమికి అక్కు పత్రాలు తక్షణమే అందజేయాలన్నారు. ఈ సదస్సులో ఆదివాసి మేధావులు, విద్యార్థి, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు, పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మడి శంకర్, మండల కమిటీ అధ్యక్షులు కొమరం శ్రీను, మండల కమిటీ సభ్యులు, ఈసం సత్యనారాయణ, చుంచు సతీష్, ఈసం శశి కుమార్, కోర్సనవీన్ తదితరులు పాల్గొన్నారు.

## BRS పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ MLA రేగా పర్యటన జయప్రదం చేయండి



**దశ, మణుగూరు:** BRS పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు నేడు అనగా మంగళవారం పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ మండలాల్లో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.సాయినాథ్ తెలిపారు. ఉదయం 9.00 గంటలకు పినపాక మండలం పాండురంగాపురంలో BRS పార్టీ మండల యూత్ అధ్యక్షులు చెన్నకేశవులు చెల్లెలు ప్రధానం వేడుకకు హాజరై నూతన వధువును ఆశీర్వదిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు అశ్వాపురం మండలం మొండికుంటలోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్లో BRS పార్టీ కార్యకర్త తాటిపాముల రమేష్ తమ్ముడు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు పాల్వంచ పెద్దమ్మ తల్లి టెంపుల్ వద్ద సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో బూర్గంపాడు మండల సీనియర్ నాయకులు జక్కం సర్వేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. కావున ఆయా మండలాలకు సంబంధించిన ముఖ్య నాయకులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తప్పక పాల్గొనవలసిందిగా కోరారు.

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌ను కలిసిన BRS జిల్లా నాయకురాలు వగ్గెల పూజ



**దశ, అశ్వారావుపేట-:** BRS పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ని సోమవారం అశ్వారావుపేట నియోజకవర్గ నాయకురాలు వగ్గెల పూజ హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఇటీవల ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం విషయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి మద్దతుగా BRS పార్టీ పక్షాన భారీ ఎత్తున నిరసన తెలిపడంపై ఆమె అభినందనలు తెలిపారు. అదే విధంగా గతంలో రవాణా శాఖ మంత్రిగా నియోజవర్గ ప్రజలపైన ప్రేమతో మంజూరు చేసిన రవాణాశాఖ కార్యాలయం ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఉన్న పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉన్న BRS పార్టీ, కార్యకర్తల పరిస్థితి గురించి వారికి వివరించి త్వరలో అశ్వారావుపేట నియోజకవర్గంలో పర్యటించాలని కోరారు.

సానుకూలంగా స్పందించిన మాజీ మంత్రి తప్పకుండా వస్తా అని కార్యకర్తలకు , ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేసి , KCR గారికి బహుమతిగా ఇవ్వాలి అని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని మాజీ మంత్రి తెలిపారు.



## బండి భగీరథ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి

❖ *BRS పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి*

**దశ, పినపాక:** మైనర్ బాలికను మోసం చేసిన కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని BRS పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి డిమండ్ చేశారు. సోమవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలికను మోసం చేసిన కేంద్రమంత్రి కొడుకుపై పోలీసులు చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారన్నారు. ఫోక్సో కేసు నమోదైన ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాధ్యతయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ కొడుకును కాపాడేందుకు ఎవరు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. మైనర్ బాలికను మోసం చేసిన కేసులో కేంద్రమంత్రి భాధ్యత వహించాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనీయర్ నాయకులు పొనుగోటి భద్రయ్య, దాట్ల వాసుబాబు, PACS చైర్మన్ రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, కొండేరురాము రాము, రాయల బాబు, బత్తుల వెంకటరెడ్డి, షేక్ జాంఘీర్, ముక్కు నాసర్ రెడ్డి, కాళ్ల చంటి, ఇసంపల్లి శీను, యక్కంటి అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను తక్షణం భర్తీఫ్ చేయాలి

❖ *రేపు జిల్లా వ్యాప్త నిరసనలు: రేగా కాంతారావు*



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** మైనర్ బాలికపై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు నమోదైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. బాధిత కుటుంబానికి ఇది మరింత నిరాశ కలిగిస్తోందని అన్నారు. బాధిత బాలికకు న్యాయం చేయాలని, కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన రాజకీయాలకు అతీతంగా మానవత్వానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. బలహీన వర్గాల భద్రత విషయంలో ప్రభుత్వాలు రాజీ పడకూడదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కుటుంబానికి హాని జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రజల్లో అవగాహన కల్పించి న్యాయం కోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఈ నిరసనల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విభాగాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రేగా కాంతారావు పిలుపునిచ్చారు.